




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జనవరి 9, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## ఈడీ సోదాలు జరుగుతుండగా ఐప్యాక్ వ్యవస్థాపకుడి ఇంటికి మమత



- ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులు
- ఇది కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుట్రేనన్న మమత
- సోదాలు జరుగుతున్న ప్రాంతానికి స్వయంగా వెళ్లిన దీదీ
- పార్టీ పత్రాలను ఈడీ తీసుకెళ్లకుండా అడ్డుకున్నానని వెల్లడి
- మమత తీరుపై విపక్ష నేత సువేందు అధికారి తీవ్ర విమర్శలు




## డీజీపీ నియామకంపై నేడు హైకోర్టు ఉత్తర్వులు

మా ప్రతిపాదనలను యూపీఎస్సీ తిప్పిపంపింది: రాష్ట్రం

అటార్నీ జనరల్ సలహా మేరకే వ్యవహరించాం:యూపీఎస్సీ

## చెట్టును ఢీకొన్న కారు.. నలుగురు విద్యార్థుల దుర్మరణం

- పుట్టినరోజు వేడుక విషాదంగా మారిన వేళ
- మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం
- కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి
- ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- మీర్జాగూడ గేటు వద్ద తెల్లవారుజామున ప్రమాదం
- కుటుంబాల్లో తీరని శోకం





# దమ్ముంటే రేవంత్‌ను నిలదీయండి: కేటీఆర్

- రాహుల్‌పై వ్యాఖ్య రేవంత్‌దే, నేను రిపీట్ చేశాను
- సోనియాపై దూషణలు చేసిన చరిత్రను కాంగ్రెస్ మరిచిందా?
- గాంధీ కుటుంబాన్ని తిట్టిన రేవంత్‌ను ఎందుకు కాపాడుతున్నారు
- చేతకాని కాంగ్రెస్ నేతలు నాపై నిందలు వేస్తున్నారు
- జలవనరులపై అవగాహన లేని సీఎం తెలంగాణను నాశనం చేస్తున్నాడు
- పాలమూరు రైతుల పొట్టకొడుతూ పాతబాస్‌కు సేవ
- అవకాశవాదులు, అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ రాజకీయాలు
- దూషణలు, కూల్చివేతలే కాంగ్రెస్ పాలన గుర్తింపు

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మాటల యుద్ధం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. గాంధీ కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి తనపై దాడి చేస్తున్న కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. "రాహుల్‌గాంధీని పప్పు కాదూ 'ముద్దపప్పు' అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే. అదే మాటను నేను రిపీట్ చేశాను. ఇందులో నా తప్పేముంది?" అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై నాపై దుమ్మెత్తిపోస్తున్న కాంగ్రెస్ నేతలకు నిజాలు మాట్లాడే ధైర్యం లేదని కేటీఆర్ విమర్శించారు. సోనియాగాంధీని ఉద్దేశించి గతంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "సోనియాగాంధీని 'వెయ్యి మందిని బలి తీసుకున్న బలిదేవతా తెలంగాణ పిల్లలను చంపింది' అని రేవంత్ అన్నది నిజం కాదా? గాంధీ కుటుంబంపై రేవంత్ చేసిన దూషణలను కాంగ్రెస్ నేతలు పూర్తిగా మరిచిపోయారా?" అని (మిగతా 2వ పేజీలో)

# 'ఉపాధి'ని తాకితే తట్టుకోం: సీఎం రేవంత్



- ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీయాలనే కేంద్ర కుట్రలను ఎండగడతాం
- దేశంలోని పేదల ఆత్మగౌరవంపై దాడిగా కొత్త చట్టాలు
- గ్రామగ్రామాన పోరాటానికి కాంగ్రెస్ సిద్ధం
- ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కుల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండానే లక్ష్యం
- రాహుల్‌గాంధీ నాయకత్వమే దేశానికి అవసరం

హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నైనా తాము సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న సీఎం, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ జనాభాలో మెజారిటీ ప్రజలు ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి పథకాన్ని నీరుగార్చడం పేదలపై ప్రత్యక్ష దాడితో సమానమని వ్యాఖ్యానించారు. దేశంలో సుమారు 140 కోట్ల జనాభాలో

(మిగతా 2వ పేజీలో)



## చైనా మాంజా అమ్మినా, కొన్నా, ఎగరేసినా కేసులే

- నిషేధిత మాంజాపై జీరో టాలరెన్స్
- ప్రాణాలకు ముప్పుగా మారిన దారం
- పీడీ యాక్ట్ ప్రయోగంపైనా పరిశీలన
- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా
- రూ.1.2 కోట్ల విలువైన మాంజా స్వాధీనం

## విద్యుత్ చార్జీలు పెంచొద్దు.. ప్రజలపై భారం వేయొద్దు

- టారిఫ్ పెంపును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- డిస్కంల ఆర్థిక లోటుకు ప్రభుత్వమే పరిష్కారం
- ఏఆర్ఆర్‌లలో చార్జీల భారం లేకుండా ప్రతిపాదనలు
- ఉత్తరదక్షిణ డిస్కంలకు రూ.22,104 కోట్ల లోటు
- ప్రజాభిప్రాయ సేకరణకు ఈఆర్‌సీ నోటిఫికేషన్
- టారిఫ్ ఆర్డర్ మార్చిలో విడుదల



హైదరాబాద్: ప్రజలపై అదనపు భారం మోపేలా విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదనలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక లోటు సమస్యను ప్రభుత్వం తన స్థాయిలో పరిష్కరిస్తుందని, ప్రజలపై చార్జీల రూపంలో భారాన్ని మోపాల్సిన అవసరం లేదని డిస్కంలకు

(మిగతా 2వ పేజీలో)



## మేడారం జాతరకు రండి

ఎర్రవల్లి వెళ్లి కేసీఆర్‌ను ఆహ్వానించిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ

వారిని ఆత్మీయంగా పలకరించి, సత్కరించిన మాజీ సీఎం దంపతులు

హైదరాబాద్, మర్కుక్, జనవరి 8 : మేడారం మహా జాతరకు రావాలని కోరుతూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆహ్వానించారు. గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికివెళ్లిన మంత్రులు.. రాష్ట్రప్రభుత్వం తరపున కేసీఆర్‌కు మేడారం జాతర ఆహ్వాన పత్రికను,

(మిగతా 2వ పేజీలో)

# స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్టాపనకు విశిష్ట అతిథులుగా (విహెచ్‌పి) నేతలకు ఆహ్వానం

## నరసింహ మూర్తి, డా" శశిధర్‌లను సన్మానించి ఆహ్వానించిన ప్రఖండ అధ్యక్షులు వారి బృందం





మాల్ వార్త మిర్రర్ ప్రతినిధి : హైదరాబాద్ విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు భోజనపల్లి నరసింహా మూర్తి జీ,డా.రావినూతల శశిధర్ జీ విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి గార్లను కలవడంజరిగింది.స్వామి వివేకానంద జనవరి 12 జయంతి సందర్భంగా గోడుకొండ్ల, వీ.టి నగర్(మాల్ పట్టణంలో) ఏర్పాటు చేయబోయే స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్టాపనకు విశిష్ట అతిథిగా హాజరుకావాలని తెలిపారు,ఆహ్వానించిన వారిలో మాల్, మర్రిగూడ ప్రఖండ అధ్యక్షులు సందుపట్ల రాజేష్ సాగర్, కనిగిరి గోవర్ధన్, సందుపట్ల లక్ష్మణ్ సాగర్, కుకుడాల వినీత్, తోకల స్వామి తేజ్ తదితరులు పాల్గొన్నారు

# చెట్టును ఢీకొన్న కారు.. నలుగురు విద్యార్థుల దుర్మరణం



శంకర్‌పల్లి, జనవరి 8 : పుట్టినరోజు వేడుకను ఆనందంగా జరుపుకొని ఇళ్లకు వెళ్తున్న ఐదుగురు విద్యార్థుల ప్రయాణం ఘోర విషాదంగా మారింది. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ గేటు వద్ద గురువారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కాలేజీలో బీబీఏ థర్డ్ ఇయర్ చదువుతున్న కూరగాయల సుమిత్ (20), నిఖిల్ (20), బీబీఏ సెకండ్ ఇయర్ విద్యార్థి దేవల సూర్యతేజ (20), బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న సుంకరి నక్షత్ర, గండిపేటలోని ఎమ్‌జీఐటీ కాలేజీలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న బల్మూరి రోహిత్ (18) స్నేహితులు. బుధవారం సుమిత్ పుట్టినరోజు కావడంతో సాయంత్రం నార్సింగిలో అందరూ కలిసి వేడుకలు జరుపుకున్నారు. కాసేపు సరదాగా గడిపిన అనంతరం రాత్రి నార్సింగిలోని ఓ హోటల్‌లో భోజనాలు చేశారు. తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లే క్రమంలో సాయి ఆకాశ్‌ను మోకిలలోని అతడి ఇంటి వద్ద దింపారు. అనంతరం మిగిలిన ఐదుగురు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కారులో నార్సింగి వైపు బయలుదేరారు. కారు నడుపుతున్న సుమిత్ డ్రైవింగ్ సీట్లో ఉండగా, అతడి పక్కన నిఖిల్ కూర్చున్నాడు. సూర్యతేజ, రోహిత్, నక్షత్ర వెనుక సీట్లో ప్రయాణిస్తున్నారు. మీర్జాగూడ గేటు వద్దకు చేరుకున్న సమయంలో కారు అతివేగంతో ప్రయాణిస్తూ అదుపుతప్పినట్లు పోలీసులు తెలిపారు. గేటు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్‌ను తప్పించే ప్రయత్నంలో వాహనం రోడ్డుపక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న దెబ్బకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయి రేకుల డబ్బా ముద్దలా మారిపోయింది. ప్రమాద తీవ్రతకు కారులో ఉన్నవారు బయటపడలేకపోయారు. ఈ ప్రమాదంలో సుమిత్, నిఖిల్, సూర్యతేజ, రోహిత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. నక్షత్రకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన నక్షత్రను చికిత్స నిమిత్తం నగరంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. ఒక్కసారిగా జరిగిన ఈ దుర్ఘటనతో మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. పుట్టినరోజు ఆనందం క్షణాల్లోనే ప్రాణాంతక ప్రమాదంగా మారడంతో శంకర్‌పల్లి ప్రాంతం మొత్తం శోకసంద్రంగా మారింది.

# ఈడీ సోదాలు జరుగుతుండగా ఐప్యాక్ వ్యవస్థాపకుడి ఇంటికి మమత... బెంగాల్‌లో పొలిటికల్ హీట్

**ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులు**

**ఇది కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుట్రేనన్న మమత**

**సోదాలు జరుగుతున్న ప్రాంతానికి స్వయంగా వెళ్లిన దీదీ**

**పార్టీ పత్రాలను ఈడీ తీసుకెళ్లకుండా అడ్డుకున్నానని వెల్లడి**

**మమత తీరుపై విపక్ష నేత సువేందు అధికారి తీవ్ర విమర్శలు**



పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ వేడి మరోసారి భగ్గుమంది. ప్రముఖ ఎన్నికల వ్యూహరచన సంస్థ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్) కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించడం తీవ్ర కలకలం రేపింది. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పన్నిన కుట్రేనని, దేశ చరిత్రలోనే ఇంతటి దుర్మార్గపు, నీచమైన హోంమంత్రిని చూడలేదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఉదయం నుంచి కోల్‌కతాలోని సాల్ట్ లేక్‌లో ఉన్న ఐ-ప్యాక్ ప్రధాన కార్యాలయంతో పాటు, సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలోనూ ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. కేంద్ర సాయుధ బలగాల (సీఏపీఎఫ్) పటిష్ట భద్రత నడుమ ఈ దాడులు జరిగాయి. విషయం తెలుసుకున్న వెంటనే మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మతో కలిసి నేరుగా ప్రతీక్ జైన్ నివాసానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి ఈడీ అధికారులతో మాట్లాడి, కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన ఆమె, మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. "నా పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. నేను వాటిని తిరిగి తీసుకువచ్చాను. ఈ పనికిమాలిన కేంద్ర హోంమంత్రి దేశాన్ని రక్షించలేరు, కానీ ఈడీ ద్వారా నా పార్టీ పత్రాలను లాక్కోవాలని చూస్తున్నారు. నేను ప్రతీక్‌కు ఫోన్ చేశాను. అతని ఫోన్, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకోవాలని అధికారులు చూశారు"అని మమత ఆరోపించారు. అనంతరం సాల్ట్ లేక్‌లోని ఐ-ప్యాక్ కార్యాలయానికి కూడా వెళతానని ఆమె తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు, అంటే 2020 నుంచి ఐ-ప్యాక్ సంస్థ తృణమూల్ కాంగ్రెస్‌కు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. మమత చర్యలపై పశ్చిమ బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ విధుల్లో మమతా బెనర్జీ నేరుగా జోక్యం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. "గతంలో కోల్‌కతా మాజీ పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లినప్పుడు కూడా ఆమె ఇదే విధంగా అడ్డుకున్నారు. సీబీఐకి వ్యతిరేకంగా నగరంలో ధర్నాకు దిగారు. ఇప్పుడు కూడా అదే పునరావృతం చేస్తున్నారు. ముఖ్యమంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఒక ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ కార్యాలయంపై ఈడీ దాడి చేస్తే ఆమెకెందుకు అంత ఆందోళన?" అని సువేందు అధికారి ప్రశ్నించారు. ఈ ఘటనతో బెంగాల్‌లో అధికార, విపక్షల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.



# మేడారం జాతరకు రండి

ఆలయ ప్రసాదాన్ని, నూతన వస్త్రాలను అందజేశారు. శాలువా కప్పి కేసీఆర్‌ను సత్కరించారు. తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను 'బాగున్నారా.. అమ్మా..' అంటూ కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. తన సతీమణి శోభతో కలిసి వారికి పసుపు, కుంకుమ, చీరలు పెట్టి సత్కరించారు. జాతరకు హాజరవుతానని చెప్పారు. మేడారం ఆలయ నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయంటూ మంత్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సమయంలో అన్ని పార్టీల నేతలను స్వయంగా కలిసి మేడారం జాతరకు ఆహ్వానించామని.. అక్కడ కేసీఆర్‌ను కలిసే అవకాశం రాకపోవడంతో, ఫామ్‌హౌ?అబశ్రీశ్రీసకు వచ్చి ఆహ్వానించామని తెలిపారు. తమ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించి, జాతరకు వస్తానని కేసీఆర్ చెప్పడం ఆనందంగా ఉందన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులకు కేసీఆర్ ఆర్థికసాయం అందించారు. ప్రమాదంలో మరణించిన ఎర్రవల్లి రైతు సత్తయ్య కుమారుడు నవీన్, అదే గ్రామానికి చెందిన పెద్దోళ్ల సాయిలు కుమారుడు అజయ్ ఇద్దరూ బీటెక్ చదివేందుకు నాలుగేళ్లపాటు కళాశాల ఫీజు చెల్లించనున్నట్టు.. పుస్తకాలు, కంప్యూటర్ కొనుగోలు కోసం కొంత తక్షణ ఆర్థిక సాయం అందజేసినట్టు కేసీఆర్ కార్యాలయం వెల్లడించింది.

# దమ్ముంటే రేవంత్‌ను నిలదీయండి: కేటీఆర్

నిలదీశారు. ఆ వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని ప్రశ్నించే ధైర్యం లేని కాంగ్రెస్ నాయకులు తనపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిని తప్పుపట్టే ధైర్యం లేని కాంగ్రెస్ నేతలను కేటీఆర్ "దద్దమ్మలు" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారు. "దమ్ముంటే రేవంత్‌ను నిలదీయండి. తప్పు చేసినప్పుడు బుద్ధి చెప్పకుండా ఎందుకు కాపాడుతున్నారు? గాంధీ కుటుంబాన్ని తిట్టిన వ్యక్తికి అండగా నిలబడి, నాపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన తీరుపై కూడా కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలే కాంగ్రెస్ పాలనకు గుర్తింపుగా మారాయని విమర్శించారు. రాష్ట్రంలోని జలవనరులపై కనీస అవగాహన కూడా లేని అజ్ఞాని ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనబెట్టి, పాతబాస్‌లను సంతృప్తిపర్చేందుకు పాలమూరు రైతుల పొట్ట కొడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అవకాశవాద రాజకీయాలతో కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి కృష్ణారావుపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలు లేని రాజకీయాలు కాంగ్రెస్ లక్షణమని, పదవుల కోసం పార్టీలు మారడమే అక్కడి నేతల పని అయిందని వ్యాఖ్యానించారు. అలాగే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ చేతికి అమ్ముడుపోయారని ఆరోపిస్తూ, ప్రజల తీర్పును మోసం చేసినవారికి భవిష్యత్తులో రాజకీయ స్థానం ఉండదని హెచ్చరించారు. గాంధీ కుటుంబం పేరుతో రాజకీయాలు చేస్తూనే, అదే కుటుంబాన్ని గతంలో దూషించిన వ్యక్తిని ఇప్పుడు దేవుడిలా కాపాడుకోవడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. నిజాలను ప్రశ్నిస్తే నోరు మూయించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు. తనపై వ్యక్తిగత దాడులు చేయడం మానేసి, గాంధీ కుటుంబాన్ని అవమానించిన రేవంత్‌రెడ్డిని ముందుగా ప్రశ్నించాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు.

# డీజీపీ నియామకంపై నేడు హైకోర్టు ఉత్తర్వులు

**మా ప్రతిపాదనలను యూపీఎస్సీ తిప్పిపంపింది: రాష్ట్రం**

**అటార్నీ జనరల్ సలహా మేరకే వ్యవహరించాం:యూపీఎస్సీ**

హైదరాబాద్, జనవరి 8 : డీజీపీ శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరించనున్నట్లు హైకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని పేర్కొంటూ టీ ధన్‌గోపాలరావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ నియామకం కోసం సీనియర్ ఐపీఎ?అబశ్రీశ్రీసల జాబితాను యూపీఎస్సీకి అందజేసిందని పేర్కొన్నారు. అయితే ఆలస్యం అయిందనే కారణం చూపుతూ దానిని తిప్పి పంపిందని, ఈ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పాటించలేదని పేర్కొన్నారు. యూపీఎస్సీ తరఫు న్యాయవాది అజయ్‌కుమార్ వాదిస్తూ.. బాగా ఆలస్యంగా డీజీపీ నియామకం కోసం జాబితా పంపారని తెలిపారు. దీనిపై అటార్నీ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకున్న తరువాత జాబితాను యూపీఎస్సీ తిప్పి పంపినట్టు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేస్తామని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

# విద్యుత్ చార్జీలు పెంచొద్దు.. ప్రజలపై భారం వేయొద్దు

హైదరాబాద్: ప్రజలపై అదనపు భారం మోపేలా విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదనలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక లోటు సమస్యను ప్రభుత్వం తన స్థాయిలో పరిష్కరిస్తుందని, ప్రజలపై చార్జీల రూపంలో భారాన్ని మోపాల్సిన అవసరం లేదని డిస్కంలకు ఆయన స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ మేరకు డిస్కంలు తమ వార్షిక ఆదాయఉఅవసర నివేదికలు (ఏఆర్ఆర్) సవరించి, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతిపాదనలు సమర్పించాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు 2026ఉ27 ఆర్థిక సంవత్సరానికి కలిపి రూ.22,104 కోట్ల ఆర్థిక లోటు ఉంటుందని తమ ఏఆర్ఆర్‌లలో పేర్కొన్నాయి. ఇందులో దక్షిణ డిస్కం రూ.9,583 కోట్లు, ఉత్తర డిస్కం రూ.12,521 కోట్ల లోటులో ఉన్నట్లు వెల్లడించాయి. వాస్తవానికి ఈ నివేదికలను గత ఏడాది డిసెంబరులోనే ఈఆర్సీ ముందుకు తెచ్చినప్పటికీ, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాటిని ప్రజల ముందుకు వెల్లడించలేదు. ఆ తొలిదశ నివేదికల్లో ఫిక్స్‌డ్ చార్జీల పెంపు, పరోక్ష విధానంలో టారిఫ్ పెంపు వంటి ప్రతిపాదనలు ఉండటాన్ని ప్రభుత్వం గమనించింది. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా జోక్యం చేసుకొని, విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం అంగీకరించదని డిస్కంలకు స్పష్టం చేశారు. ప్రజలపై భారంగా మారే ఏ నిర్ణయాన్నీ అనుమతించబోమని చెప్పడంతో, డిస్కంలు తమ ఏఆర్ఆర్‌లను సవరించి, ఆర్థిక లోటును ప్రభుత్వం నుంచి భర్తీ చేసుకునే విధంగా కొత్త ప్రతిపాదనలను రూపొందించాయి. ప్రజాభిప్రాయ సేకరణకు ఈఆర్సీ నోటిఫికేషన్ జారీ చేయడంతో తాజాగా సవరించిన ఏఆర్ఆర్‌లను డిస్కంలు బహిర్గతం చేశాయి. ఈ నెల 31వ తేదీ వరకు డిస్కంల నివేదికలపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను ప్రజల నుంచి స్వీకరించనున్నారు. అనంతరం మార్చి 5న హనుమకొండలో, మార్చి 7న హైదరాబాద్‌లోని ఈఆర్సీ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నారు. ఆ విచారణల అనంతరం టారిఫ్ ఆర్డర్‌ను ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర బడ్జెట్ ముందు జరిగే కీలక సమావేశాల నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ నెల 10న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రాల అవసరాలు, కొత్త ప్రాజెక్టులు, విధానపరమైన మార్పులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించనున్నారు. డిప్యూటీ సీఎంతో పాటు ఆర్థిక శాఖ అధికారులు కూడా ఈ భేటీలో పాల్గొననున్నారు. అదే సమయంలో రాష్ట్ర బడ్జెట్ సన్నాహకాలు కూడా వేగం పుంజుకోనున్నాయి. సంక్రాంతి అనంతరం అన్ని శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రజలపై భారం లేకుండా సంక్షేమం, అభివృద్ధికి నిధులు కేటాయించే దిశగా బడ్జెట్‌ను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# చైనా మాంజా అమ్మినా, కొన్నా, ఎగరేసినా కేసులే

హైదరాబాద్: చైనా మాంజాపై హైదరాబాద్ పోలీసులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. నిషేధం ఉన్నప్పటికీ అక్రమంగా విక్రయాలు, వినియోగం కొనసాగుతుండటంతో ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు. ఆ దారాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా, అదే మాంజాతో పతంగులు ఎగరేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల నగరంలో భారీగా నిషేధిత చైనా మాంజా పట్టుబడటంతో పోలీసులు తమ వైఖరిని మరింత కఠినతరం చేశారు. ఈ అంశంపై కమిషనర్ సీపీ సజ్జనార్ మాట్లాడుతూ చైనా మాంజాపై నిషేధం విధించి ఇప్పటికే పదేళ్లు గడిచిందని గుర్తు చేశారు. పరిశ్రమల అవసరాల కోసం తయారయ్యే ఈ దారాన్ని పతంగుల మాంజాగా వాడటం వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. గత కొన్ని ఏళ్లుగా చైనా మాంజా కారణంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, ప్రాణ నష్టం కూడా జరిగిందని తెలిపారు. ఇకపై నగర పరిధిలో చైనా మాంజా విషయంలో పూర్తిస్థాయి కట్టడి ఉంటుందని స్పష్టం చేశారు. చైనా మాంజా వల్ల ఎవరైనా గాయపడినా, ప్రమాదానికి గురైనా సంబంధిత వారిపై తప్పకుండా కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. అవసరమైతే ఈ వ్యవహారంలో పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా కూడా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ ముందుకు సాగుతుందని, చైనా మాంజాపై ఎలాంటి సహనం ఉండదని స్పష్టం చేశారు.

# పదవ తరగతి ఇర్రెగ్యూలర్ విద్యార్థిని ఇంటికి సర్పంచ్, అధికారులు...

**పాఠశాలకు రాను, పరీక్షలు వ్రాయనని మారాం చేసిన విద్యార్థిని**

**జిల్లాలో ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా ఆశించిన ఫలితాలు... సర్పంచ్ నీరటి శ్రీనివాస్**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 8

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో చదువుచున్న పదవతరగతి ఒక విద్యార్థిని ఈ విద్యసంవత్సరం ప్రారంభమైన నుండి 139 పని దినాలకు గాను కేవలం 24 రోజులే బడికి రావడంతో నిత్యం బడికి రాకపోవడంతో జగిత్యాల జిల్లా విద్యశాఖాధికారి కేలోత్ రాము నాయక్ ఆదేశాల మేరకు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్, గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారి శ్రీపతి రాఘవులు, మాజీ ప్రజా ప్రతినిధులను ఇర్రెగ్యూలర్ విద్యార్థిని ఇంటికి తీసుకవెళ్ళి విద్య యొక్క ఆవశ్యకత ను, పదవ తరగతి పాసైతే కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. డిఈవో ఆదేశాలకంటే ముందు చాలా సార్లు వెళ్ళినా రావడంలేదని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఎంత చెప్పిన బాలిక ఇంటిలో నుండి బయటి రాకపోవడం, నేను చదువుకోను, పాఠశాలకు రాను, పరీక్షలు వ్రాయనని మారాం చేయడంతో వాళ్ళ కుటుంబ సభ్యులతో ఫోటో దిగి వచ్చారు. మానసిక స్థితి, ఫోన్ కు అడిక్ట్ కావడము, మూఢనమ్మకాలే ఈ స్థితికి కారణము కావచ్చని భావిస్తున్నారు. జిల్లాలో గల ఈ రకమైన స్థితి గల ఇర్రెగ్యూలర్ బాల బాలికలకు ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా ఆశించిన ఫలితాలు రావచ్చని ఆ



దిశగా సంబందిత జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నీరటి శ్రీనివాస్, పలువురు కోరుచున్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ యూపిపి జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రమేష్, నరేష్, నవీన్, రాజుకుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మ లింగస్వామి

సంస్థాన్ నారాయణపూర్ జనవరి08 ( వార్త మిర్రర్ ) నారాయణపురం మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను డార్మెటరీస్ విద్యపై సమీక్ష చేస్తూ ప్రతి గదిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేస్తామని స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మ లింగస్వామి విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగింది.స్నానాల గదులు సరిపడినందున లేనందున తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అదేవిధంగా తరగతి గది డార్మెంటరీ రూమ్ ఒకటే కావడం వల్ల తీవ్ర అసౌకర్యం ఏర్పడుతున్నదని దీనివల్ల విద్యార్థుల విద్యకు ఆటంకాలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారని. ఇట్టి సమస్యలను స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగింది. మెనూ ప్రకారమే వంటలు వండించి విద్యార్థులకు పౌష్టికంగా ఆహారము అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ గ్రామ ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి వార్డు మెంబర్లు కట్ల వనజ భాస్కరాచారి బలుగూరి శివకుమార్ సూరపల్లి



వెంకటేశం పందుల యాదగిరి గౌడ్ సింగం భాస్కర్ సింగపంగా ప్రశాంతి రమేష్ సభావాత్ రఘు కాంగ్రెస్ నాయకులు భూపతి బలరాములు గునిగంటి రాజు గౌడ్ సింగం కృష్ణ హర్రిషి. సాదక్ ఖురేషి. తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురు చూపులు

వార్త మిర్రర్ మల్యాల ప్రతినిధి(జనవరి 8) : చందుర్తి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మర్రి మల్లేశం పంక్చర్ చేసే కార్మికుడి గా జీవనోపాధి పొందుతున్నాడు... అసలే పేదరికం.. దీనికితోడు అనారోగ్యం.. ఆపై ఆర్థిక భారం.. ఖరీదైన ఆసుపత్రులకు వెళ్లి వైద్య చికిత్స పొందలేని దయనీయ స్థితి.. మర్రి మల్లేశం కు రెండు కిడ్నీలు ఇన్ఫెక్షన్ కు గురికావడం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.ఇతనికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వీరిని పోషించుకుంటూ జీవనం కొనసాగించిన మర్రి మల్లేశం... గత వారం రోజుల క్రితం హార్ట్ స్ట్రోక్ రావడం తో పాటు, రెండు కిడ్నీలు ఇన్ఫెక్షన్ కు గురి కావడంతో, వైద్యం కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేరడం తో ఇప్పటికి సుమారు 10 లక్షలు ఖర్చు పెట్టినారు. ఇక వైద్యం చేయించడానికి కూడ డబ్బు లేకపోవడం వల్ల బాధితుడి కుటుంబసభ్యులు అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.. కానీ వైద్యులు చికిత్స చెయ్యడానికి అవసరమైన వైద్య పరీక్షలు, తదితర చికిత్సల కోసం సుమారు 10 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో బాధిత కుటుంబం వారు దాతల కోసం ఎదురు చూస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కా నిండని మా కుటుంబ పరిస్థితి, అంత డబ్బు వెచ్చించేది ఎలా అని బాధిత కుటుంబసభ్యులు, వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. మెరుగైన చికిత్స కోసం ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తేనే చికిత్స చేయించే పరిస్థితిలో ఉన్నామని బాధిత కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, నాయకులు,



యువకులు చొరవ చూపి ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబసభ్యులు, వారి బంధువులు కోరుతున్నారు.. ఆర్థిక సాయం చేసేవారు: అర్సం అనిల్ కుమార్ 8331971043, అర్సం మన్విత 8501897143 నంబరుకు ఫోన్ పే ద్వారా పంపగలరు.

# కొండ విజయ్ చే స్పందన సేవా సంస్థ వారికి ఐడి కార్డుల పంపిణీ..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్: హెూప్ ఫౌండేశన్ ఫౌండర్ చైర్మన్ కొండ విజయ్ స్పందన సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి చేతుల మీదుగా స్పందన సేవా సంస్థ అధ్యక్షులు కొమ్ముల శ్యామ్ ఆధ్వర్యంలో నూతనంగా జాయిన్ అయినా వారందరికీ ఐడి కార్డ్స్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కొండ విజయ్ మాట్లాడుతూ స్పందన సేవా సంస్థ కార్యక్రమాలు బాగున్నాయని మరింత సేవ చేయడానికి, ఆహార పంపిణీ కొరకు కిరాయి వాహనాలపై ఆధారపడే సంస్థ కొరకు త్వరలోనే ఓమ్ని లాంటి బండి కొని పెడతానని హామీ ఇవ్వడం జరిగింది. వారికి ఈ సందర్భంగా సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు సంస్థ సభ్యులు తెలియజేశారుఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ. షేక్ సలీం,ట్రెజరర్. అలిగే వినోద్, బేగారి ఆనంద్,రాంబాబు, రవి, అశోక్, లాలూ ప్రసాద్, మల్లేష్ యాదవ్, షేక్ హాజీ, పెంద్యాల ప్రశాంత్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆరోగ్యకరమైన నేర రహిత సమాజం కోసం మద్యపానాన్ని నిషేధించాలి మత్తు పదార్థాలను నిర్మూలించాలియువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాలిఅనే నినాదంతో మియాపూర్ 108 డివిజన్ పరిధిలో వాడవాడన 8వ తేదీ నుండి 13 జనవరి వరకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారంరోజు ముజాఫర్ అహ్మద్ నగర్ లో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది ముగ్గుల పోటీలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలను నిర్ణయించారు. విజేతలకు స్థానిక మియాపూర్ సెక్టర్ ఎస్సై సవిత, శిరీష రెడ్డి చేతుల మీదుగా మెమంటోస్ అందజేయడం జరిగిందిఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు తాండ్ర కళావతి,అంగడి పుష్ప, వల్లేపు అనిత, శివాని,



సుల్తానాబేగం,రజియాబేగం, స్థానిక మహిళలు మహిళలు హాజరై విజయవంతం చేశారు.

# రాచకొండ ఫుడ్ కోర్ట్ హెూటల్‌ను ప్రారంభించిన ఇ.ఎల్.వి భాస్కర్

సంస్థాన్ నారాయణపురం జనవరి 08( వార్త మిర్రర్ ) : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చౌరస్తాలో రాచకొండ ఫుట్ కోర్ట్ హెూటల్ ను ప్రారంభించిన ఇ.ఎల్. వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్, స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మ లింగస్వామి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఇ.ఎల్.వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ హెూటల్లో నాణ్యతతో కూడిన రుచికరమైన రుచిని అందించాలని హెూటల్ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ.ఎల్. వి అశోక్, బండమీది కిరణ్, పల్లె మల్లారెడ్డి పట్నం బాలకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# అల్లీపూర్ లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 8 : తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం చేపట్టిన పథకం ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రతి మహిళకు 18 సంవత్సరలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్క మహిళకు ఒక్కో చిర ఇవ్వడం జరుగుతుంది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో సర్పంచ్ ఎంబారి గౌతమి - వెంకటేష్, ఉపసర్పంచ్ వినయ్, వార్డు సభ్యులందరి,మరియు గ్రామ సెక్రటరీ శేఖర్, మరియు మాజీ సర్పంచ్ గంగారెడ్డి, చేతుల మీదుగా చీరల పంపిణి జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



# దూప దీప నైవేద్య అర్చక అధ్యక్షనీగా వెంకటకృష్ణ ఎన్నిక


వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 8

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్‌లోని లక్ష్మ నరసింహ స్వామి దేవాలయంలో దూప దీప నైవేద్య అర్చక సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా అధ్యక్షులు నాగరాజు మహీంద్రా చారి, ప్రధాన కార్యదర్శి అల్వాలా ఆత్మరాం, సహాయ కార్యదర్శి దేశ్ ముఖ్ ఫణిందర్ శర్మ, ప్రచార కార్యదర్శి బ్రహ్మన గారి శంకర్ శర్మ హాజరయ్యారు. సమావేశంలో కాకుస్తం వెంకట కృష్ణను రాయికల్ మండల అధ్యక్షనిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తిరునహరి శేఖర్, జక్కాపురం శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, కోటగిరి శ్రీనివాస్, తిరుణగరి శ్రీకాంత్, సాయికుమార్, ప్రదీప్, రమణ తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుర్తిలో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం

కల్వకుర్తి జనవరి 8 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జూలూరు రోహిత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నదానం మహాదానం అని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని అన్నారు. బస్టాండ్ వద్ద 350 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిగుల్లపల్లి శ్రీధర్, కార్యదర్శి కల్మిచర్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రత్యేక ప్రతినిధి ( వార్త మిర్రర్ ) జనవరి08: భువనగిరి పట్టణ 23వ వార్డు ఇందిరానగర్ లో బర్రె హేమలత గంగారం శరత్ కుమార్ అనారోగ్యానికి గురై వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోవడం కోసం ఎక్కువ మొత్తంలో వైద్య ఖర్చులు పెట్టుకున్న వారికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహాయ నిధి కోసం స్థానిక మాజీ కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈరోజు భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యంలో స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదాల గురై మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని వైద్యం కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చులు చేసుకున్న వాళ్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకుండా ఆర్థిక భరోసా కల్పించాలని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజల జీవితాలలో ఎంతో వెలుగును నింపుతుందని అన్నారు భువనగిరి నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంత మంది అప్లై చేసుకుంటే అంత మందికి మంజూరు చేయించడం జరిగిందని అన్నారు పేద ప్రజలను ఆర్థికంగా నష్టపోకుండా వాళ్లను ఆర్థికంగా బలోపేతం చేయడం ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల వరకు పెంచి పేద ప్రజలకు నాణ్యతమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ బర్రె మహేందర్ కసరబోయిన సాయి నరేందర్ గోపి బాబు నువ్వుల రాజు ప్రభాకర్ తదితరులు పాల్గొనడం జరిగింది

# వెనిజులపై ట్రంపు పెత్తనానికి నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

మిర్యాలగూడ జనవరి 8:-( వార్త మిర్రర్)స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ లేని ఒక దుర్మార్గం జైల్లలో మగ్గుతున్న ఖైదీలకు బెయిల్ ఇవ్వకుండా ఉండటాన్ని, వెనిజులపై ట్రంపు కర్ర పెత్తనానికి నిరసనగా ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఎన్ ఎస్పీ క్యాంపు లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏ నేరం చేయకుండా నిజాలు మాట్లాడినందుకు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకు ముస్లిం లైతే మొత్తం వ్యవస్థ కక్షపూరితంగా వ్యవహారిస్తూ ఉన్నారని ఆరోపించారు. ఢిల్లీ అల్లర్ల కేసులో జైల్లో ఐదేళ్లుగా ఉన్న బెయిల్ ఇవ్వడంలో న్యాయ స్థానాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నించినందుకుగాను జైళ్ళలో ఏండ్లతరబడి బందించి ఉంచుతున్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరముందన్నారు. జైళ్ళలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ప్రపంచ పోలీసుగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజుల అధ్యక్షుడు నీకోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లో?రెసా లను వెంటనే విడుదల చేయాలని, దేశ సర్వభౌమత్వాన్ని కాపాడాలని కోరారు.కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బీసం రామయ్య, భారత్ బచావో జిల్లా కన్వీనర్ ఉదయ, కిరణ్మయి, సామాజిక వేత్త డాక్టర్ జె.రాజు, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, విద్యా వంతుల ఐక్య వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య,




ముస్లింఎ విద్యావంతుల ఐక్య వేదిక అధ్యక్షుడు మౌజమ్ హుస్సేన్, జమైతే అవామ్ అధ్యక్షులు ఎంఎ. సమీఖాద్రి, తెలంగాణ హఫిజ్, అమిర్ షరీఫ్, మహబూబ్ అలీ లు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

## ఇంటర్ బోర్డు అధికారి భీమ్ సింగ్





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 08 : రాబోయే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు జెయింట్ సెక్రెటరీ ఉమ్మడి నల్గొండ జిల్లా స్పెషల్ అధికారి భీమ్ సింగ్ అన్నారు. గురువారం చౌటుప్పల్ కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను, ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ప్రాక్టికల్, థీయరి పరీక్షలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అబశ్రీశ్రీ ఇందులో భాగంగా జరిగే ప్రాక్టికల్ , థియరీ రెండు పరీక్షలకు తప్పనిసరిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించ బడతాయని తెలిపారు. ప్రాక్టికల్ సెంటర్లో ప్రతి కళాశాలలో తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు, ల్యాబ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని అధ్యాపకులకు సూచించారు. అంతేకాకుండా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఉండాలని వారికి ఆదేశించారు. ఇంటర్ బోర్డు ఏర్పాటుచేసిన హాల్ టికెట్లలో ఎలాంటి తప్పులు ఉన్న సంబంధిత సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు తప్పులు ఏమైనా ఉన్నట్లయితే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ కుసమాచారం ఇవ్వాలని ఆయన అన్నారు. జనవరి 21న, ఇంగ్లీష్ ప్రాక్టికల్ ప్రథమ సంవత్సరం, 22 న, ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలతో పాటు, ఈనెల 24న పర్యావరణ పరీక్షలు కూడా నిర్వహించ బడతాయని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి మొదటి నుండి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 25 నుండి థీయరి పరీక్షలు ప్రారంభమవుతాయని అన్నారు. బోర్డు నిర్వహించే ప్రతి పరీక్ష సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు రాబోయే పరీక్షలకు పకడ్బందీ ప్రణాళిక నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులుగా తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, ప్రతిభ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ , తదితర అధ్యాపకులు పాల్గొన్నారు

# ఉస్మానియా వర్సిటీలో "వాతావరణ మార్పులు, రుతుపవనాల వైవిధ్యం, నీటి భద్రత" పై రెండు రోజుల జాతీయ కార్యశాల






సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 8 : "భారతీయ నదీ పరివాహక ప్రాంతాలలో వాతావరణ మార్పులు, రుతుపవన వైవిధ్యం, నీటి భద్రత" అనే అంశంపై ఓయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టిన రెండు రోజుల కార్యశాలను ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం ప్రారంభించారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఞాచీ=ఖీ) సౌజన్యం, సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ , ఓయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా ఈ కార్యశాల నిర్వహిస్తోంది. కార్యశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటి వనరుల సంరక్షణ అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు... వర్షపాతం, వ్యవసాయం, ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఇది సామాన్య ప్రజల జీవితాలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగాల్లో పరిశోధనలు ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యల' కు అనుగుణంగా ఉండాలని ప్రొఫెసర్ కుమార్ స్పష్టం చేశారు. నీరు ఉ ఆహారం –శక్తి వంటి ఇంటర్ డిసిప్లినరీ అంశాలపై పరిశోధకులు దృష్టి సారించాలని ఆయన ఔత్సాహిక పరిశోధకులకు పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం సీఈఓ షేక్ మీరా మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ పర్యవేక్షణ మౌలిక సదుపాయాలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా ఉష్ణోగ్రత, వర్షపాతాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, విపత్తుల నివారణకు ముందస్తు సమాచారాన్ని అందిస్తున్నట్లు వివరించారు.ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ... వాతావరణ అంచనా, క్లైమేట్ సైన్స్ వంటి రంగాల్లో పరిశోధనలు... ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.వి.ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ విభాగం సాధించిన విద్యా, పరిశోధన విజయాలను వివరిస్తూ అతిథులకు స్వాగతం పలికారు. కార్యశాలకు ప్రొఫెసర్ కె. శశికాంత్, డాక్టర్ హరీష్ గుప్తా సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు నీటి వనరుల నిర్వహణ, వాతావరణ సవాళ్లపై విద్యార్థులకు, పరిశోధకులకు అవగాహన కల్పిస్తున్నారు.

# సమాచార హక్కు చట్టం రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

## సభ్యులతో ఆవిష్కరించిన రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్

దేవరకొండ జనవరి 08 వార్త మిర్రర్:భారతదేశంలో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించడం ఒక మైలురాయి అని ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ అన్నారు. హైదరాబాద్ లోని సమాచార హక్కు భవన్ లో గురువారం నాడు సమాచార హక్కు చట్టం రక్షణ సమితినూతన సంవత్సర-2026 క్యాలెండర్ ను ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశాల భూపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005పారదర్శకత జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం అవినీతిని అరికట్టడం, పౌరులకు సాధికారత కల్పించడం లో దోహదపడుతుందని వారు అన్నారు.ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేయడం కోసం బలమైన చట్టపరమైన చర్యలు పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడానికి అనువైన చట్టమే సమాచార హక్కు చట్టం-2005 అని ఆర్టీఐ కమిషనర్ అన్నారు..ప్రభుత్వ అధికారులను జవాబుదారీగా ఉంచడానికి ఇది శక్తివంతమైన సాధనం లా ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర కిషన్ నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజీమ్ రాష్ట్ర కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి రాష్ట్ర ప్రచార కార్యదర్శి డా,,ఎండీ జిలానీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..




# బంగ్లాదేశ్ లో మత దాడులను ఖండిస్తున్నాం

## న్యాయవాది కట్టెల లింగస్వామి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 08

బంగ్లాదేశ్ లో గత కొన్ని సం,,రాలుగా మైనార్టీలైన హిందూ ప్రజలపైన జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని విద్యావంతుల వేదిక నాయకులు, న్యాయవాది కట్టెల లింగస్వామి అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా మైనార్టీ మత ప్రజలపైన దాడులు రోజురోజుకు పెరగడం పెరుగుతున్న మతోన్మాదానికి నిదర్శనమని ఆయన అన్నారు. జాత్యహంకార దాడులు, మత అహంకార దాడులు ప్రపంచ ప్రజల మధ్య సోదర భావాన్ని దెబ్బ తీస్తున్నాయని, మానవత్వానికి మంటలు రాజేస్తున్నాయని అన్నారు. ఆధిపత్యం కోసం మనుషులను చంపే మతం అసలు మతమే కాదని, ఏ మతం కూడా తోటి మనుషులను చంపమని చెప్పలేదని అది వారి మతానికే వ్యతిరేకమని ఆయన అన్నారు.ఏ దేశంలోనైన మతం పేరుతో, కులం పేరుతో, జాతి పేరుతో జరిగే దాడులను మానవత్వం ఉన్న ప్రజలందరూ ఖండిచాల్సిందేనని అన్నారు. మతం మత్తు తలకెక్కితే అది ఉన్మాదంగా మారి, ఇలా మనుషులను హత్యలు చేయిస్తుందని అన్నారు.మానవత్వం ఉన్న ప్రతీ మనిషి కులం పేరుతో, మతం పేరుతో, జాతి పేరుతో జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం నేడు ఉందన్నారు. అందులో భాగంగానే బంగ్లాదేశ్ లో మతం పేరుతో హిందూ ప్రజల పైన జరుగుతున్న దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలని ఆయన అన్నారు.

# కొత్తగా ఓటు అప్లై చేసుకున్న వారికి మున్సిపల్ ఎలక్షన్ లో అవకాశం కల్పించాలి : దబ్బటి శేఖర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 08

సమాచార హక్కు రక్షణ చట్టం - 2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దబ్బటి శేఖర్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన వారు నూతనంగా ఓటు అప్లై చేసుకొని ఓటు హక్కు వచ్చినవారు మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా యువతకు ఓటు హక్కును కల్పించాలని కోరుతూ ఎలక్షన్ కమిషన్ కి , జిల్లా కలెక్టర్ కి పత్రికా ప్రకటనలో తెలియజేస్తున్నాను



# అడవిలో అగ్ని ప్రమాదాల నివారణ అవగాహన సదస్సు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 8

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం ఒడ్డెర కాలనీ శివాజీ నగర్ లో ఆటవి శాఖ అధికారులు అడవిలో అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అటవీ సెక్షన్ అధికారి ఎస్.కె విజయ్ కుమార్, అటవీ అధికారి చంద్రశేఖర్, రత్నాకర్ బేస్ క్యాంప్ సిబ్బంది, వడ్డెర కాలనీ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బోధస్ రాజేష్, లక్ష్మణ్, రాజారెడ్డి, వెంకటేష్, బుజ్జయ్య, రాజం, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.




# గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం లో పాల్గొన్న..పారిజాత నర్సింహారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 08 : గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్ష నటరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ విస్తృతస్థాయి సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు అనంతరం సమావేశంలో టిపీసీసీ, డీసీసీ కమిటీల బలోపేతం, రానున్న మున్సిపల్, కార్పొరేషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రజాదరణ పొందిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కుట్రపూరితంగా రద్దు చేయడాన్ని మరియు పేరు మార్పును నిరసిస్తూ తీర్మానం చేయడం జరిగింది. అలాగే పాత పేరుతోనే కొనసాగించాలని ఈ నెల 10 నుండి ఫిబ్రవరి 25 జరిగే బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.



# రామకృష్ణాపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

## రేవంత్ రెడ్డి ప్రజారంజక పాలనకు ఆకర్షితులై

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికల టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 08 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మహిళా జనరల్ సెక్రెటరీ లిఅనురాధ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన

## స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

జూబ్లీహిల్స్ లోని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి. తిరుమల తిరుపతి పట్టు శాలువను కప్పి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించి. నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపిన స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్, స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్, రంగారెడ్డి జిల్లా డిగ్రీ ప్రైవేటు కళాశాలల కమిటీ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ఈ సందర్భంగా రాపర్తి సురేష్ గౌడ్ తో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికలపై, మునుగోడు నియోజకవర్గం లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం పైన, రాబోయే మున్సిపల్ ఎన్నికలపై పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు అని తెలుస్తుంది



## మైనంపల్లి గ్రామంలో విద్యుత్ అధికారుల ప్రజాబాట

దేవరకొండ జనవరి 08 వార్త మిర్రర్ : దేవరకొండ మైనంపల్లి గ్రామం బీచ్యతాండలో విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం నాడు ప్రజా బాట కార్యక్రమం చేపట్టారు ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు స్థానిక సర్పంచ్.మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ విద్యుత్ డీఈ బాల్య నాయక్.ఏ డి సైదులు. ఏ ఈ రాజేష్ లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని అదేవిధంగా కరెంట్ పట్ల జాగ్రత్త వహించాలి అని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ. వార్డు సభ్యులు సంతోష్ వెంకట్. కిషన్. లక్ష్మ ప్రశాంత్. విద్యుత్ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



# ఖాళీ అవుతున్న హైదరాబాద్..

## కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

### సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు పయనమవుతున్న జనాలు

### జనసంద్రాన్ని తలపిస్తున్న రైల్వే స్టేషన్లు

### ఇప్పటికే 150 ప్రత్యేక రైళ్లను అనౌన్స్ చేసిన దక్షిణ మధ్య రైల్వే

తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ లో నివసిస్తున్న కుటుంబాలు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమవుతున్నాయి. ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. సికింద్రాబాద్ స్టేషన్ అయితే పూర్తిగా రద్దీతో నిండిపోయింది. లగేజీలు, పిల్లలు, పెద్దలతో జనసంద్రం కనిపించింది. ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను అనౌన్స్ చేసింది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ఏపీ ప్రాంతాలకు డిమాండ్ ఆకాశాన్నంటడంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గించేందుకు... జనవరి 7 నుంచి 20 వరకు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. దీనివల్ల ఐటీ కారిడార్‌లో ఉండే ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే సౌకర్యం లభిస్తుంది, ఇది చాలా మందికి భారీ రిలీఫ్‌గా మారింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్లాట్‌ఫామ్ 10 వైపు పార్కింగ్, ఎగ్జిట్ మార్గాలు మార్చారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అదనపు సిబ్బంది, పోలీసు బలగాలను మోహరించారు. ఇక అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునేవాళ్లు 'రైల్ వన్' యాప్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 3 శాతం డిస్కౌంట్ లభిస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

# డ్రగ్స్ దందా... కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

కువైట్ న్యాయస్థానం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష విధించింది. హెరాయిన్, మెథంఫెటమైన్‌లతో పట్టుబడిన ఇద్దరికి అక్కడి న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ, ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టి ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని సమాచారం. ఈ మేరకు ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా, దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

# విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్నటువంటి నూకల విద్యాసాగర్ రెడ్డి వైన్స్ ను తొలగించాలి

పీ. ఏ.పల్లి జనవరి 08 వార్త మిర్రర్ ::పీఏ పల్లి మండల కేంద్రంలో పాఠశాలల సమీపంలో ఉన్నటువంటి వైన్సు్ను తొలగించాలని యూత్ కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వైన్స్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, మాట్లాడుతూ.... ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రభుత్వ పాఠశాల,ప్రైవేటు పాఠశాలలకు సమీపంలో నిర్వహించి విద్యార్థులకు ఇబ్బందికరంగా వహిస్తున్నటువంటి వైన్స్ యజమాన్యం తక్షణమే వేరొక చోటుకు నిర్మించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ వైన్స్ కారణంగా విద్యార్థులు రాకపోకలు నిర్వహిస్తున్నటువంటి ప్రయాణికులు తరచూ ఇబ్బందులకు వైన్సు పక్కనే ఉన్నటువంటి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు తలనొప్పిగా మారిందని రాత్రి సమయంలో మద్యం సేవించిన సీసాలను పాఠశాల గ్రౌండ్లో విసిరేయడం ప్రహరీ గోడ దూకి లోపడ కూర్చొని మద్యం సేవించడం జరుగుతున్నాయని ఈ మధ్య కాలంలోనే మద్యం సేవించి కొంతమంది ప్రహరీ గోడ దూకి గ్రౌండ్ పరిధిలో గొడవకు దిగడం జరిగిందన్నారు. అదేవిధంగా మద్యం సేవించిన వారు పక్కనే ఉన్నటువంటి గ్రౌండ్లో మూత్ర విసర్జన చేస్తూ బాటిల్ విసిరేస్తూ పాఠశాల విద్యార్థులను భయభ్రాంతుల గురి చేస్తున్నారని వారు అన్నారు.పక్కనే ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,సెయింట్ మేరీ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అక్కడి నుంచి వెళ్లాల్సి ఉండగా మద్యం సేవించిన వారు కూడా విద్యార్థులకు ఇబ్బందికరంగా వ్యవహరించడం జరుగుతుందని వారు అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనలకు 100 మీటర్ల దూరంలో ఉండాల్సినటువంటి వైన్స్ కనీసం 50 మీటర్ల దూరం కూడా లేకుంటే నిర్వహించి విద్యార్థులను ఇబ్బందుల గురిచేస్తున్నటువంటి వైన్స్ యజమాన్యం పైన ఎక్సైజ్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు..ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కావాలి కృష్ణయ్య,



పీ.ఏ పల్లి మండల సర్పంచ్లు శ్రీనివాస్ రెడ్డి,రామావత్ చిరంజీవి,మద్దిమడుగు నెల్సన్, నేనావత్ అనిత లక్ష్మణ్, స్వామి,రమేష్, నాయక్, గోవర్ధన్, ప్రదీప్, సన్నీ, కళ్యాణ్,మేగవత్ కిషన్, ఏఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దిమడుగు వెంకటేష్,జల్లెల్ల ఇద్దిరాములు తదితరులు ఉన్నారు.

# డిండి మండల కేంద్రంలో నూతన సర్పంచులకు సత్కారం

## ఈసీ మెంబర్ గా సర్పంచ్ ముణావత్ దివ్య శంకర్ నాయక్





డిండి (గుండ్లపల్లి) జనవరి 08 వార్త మిర్రర్:డిండి (గుండ్లపల్లి)మండల నూతన సర్పంచులను ఘనంగా సత్కరించారు అనంతరం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా శాంతి గూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా మూడవత్ రేఖ్య నాయక్ ఈసీ మెంబర్ గా పడమటి తండా ముణావత్ దివ్య శంకర్ నాయక్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ నా ఎన్నికలు సహకరించిన సర్పంచులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. మండలంలోని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచులకు అన్ని విధాల సహకరిస్తూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు సమన్వయంగా ఉంటానని వారన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులపై గ్రామాలలో మరిన్ని బరుబాయితులు పెరిగాయని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆశీర్వాదంతో గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు వారితోపాటు ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు ఉన్నారు.

# అశోక్ నగర్‌లో నిరుద్యోగుల అరెస్టు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు

### నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికమన్న కవిత

### అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని విమర్శ

### వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి, అందుకు అనుగుణంగా నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్



రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలంటూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం దారుణమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ హామీలు గుప్పించిందని విమర్శించారు. ప్రస్తుతం జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు 20 వేలకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, దానికి అనుగుణంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. కాగా, అశోక్ నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. వెంటనే జాబ్ క్యాలెండర్‌ను, నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గ్రంథలయం నుంచి అశోక్ నగర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## ఏపీలో 13 మంది అధికారులపై

# ఏసీబీ కేసులు...

## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

### 13 మంది ఏపీ అధికారులపై ఏసీబీ కేసులు

### ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసిన ఏపీ హైకోర్టు

### సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏసీబీ

ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 మంది ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసుల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును కొనసాగించేందుకు సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది.

**వివాదం నేపథ్యం ఇదే..**

2016-2020 మధ్య కాలంలో పలువురు ప్రభుత్వ అధికారులపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలతో ఏసీబీ కేసులు నమోదు చేసింది. విజయవాడలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) ద్వారా ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే నాటికి సీఐయూను అధికారికంగా పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేయలేదని, కాబట్టి ఆ కేసులకు చట్టబద్ధత లేదని నిందిత అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది.

**హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సుప్రీం**

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఏసీబీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సాంకేతిక కారణాలతో అవినీతి కేసుల దర్యాప్తును అడ్డుకోవడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఇది న్యాయ వ్యవస్థకే అవమానకరమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ, దర్యాప్తు కొనసాగించాలని ఏసీబీని ఆదేశించింది. అయితే, 6 నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని, ఈ సమయంలో అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి సాంకేతిక అంశాలపై దాఖలయ్యే పిటిషన్లను హైకోర్టులు విచారించరాదని కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది.